క్లుప్తంగా

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న చైర్మన్ రాంపాల్‌నాయక్

ఆమనగల్లు: ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వార్డుల్లో రూ.2.30 కోట్లతో చేపడుతున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులను శుక్రవారం మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్ ప్రారంభించారు. మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డులో రూ.60 లక్షలు, 11వ వార్డులోని ఆదర్శనగర్ కాలనీలో రూ.70 లక్షలు, 14వ వార్డులో ప్రేమ్‌నగర్ కాలనీలో రూ.40 లక్షలు, 15వ వార్డులోని ఉదయనగర్ కాలనీలో రూ.60 లక్షలతో సీసీ రోడ్లు నిర్మిస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ దుర్గయ్య, కౌన్సిలర్లు సుజాత రాములు, బైకని యాదమ్మ, శ్రీశైలం యాదవ్, చెన్నకేశవులు, చెక్కల లక్ష్మణ్, విజయ్‌కృష్ణ, విక్రంరెడ్డి, నర్సింహ పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ల పంపిణీ



పరీక్ష ప్యాడ్లు అందజేసిన ఎస్ఎస్‌యూఐ నేతలు

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని కస్తూర్బాగాంధీ విద్యాలయంలో శుక్రవారం ఎస్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులను పంపిణీ చేశారు. కస్తూర్బాగాంధీ విద్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మండల ఎస్ఎస్‌యూఐ అధ్యక్షుడు ఫరీద్ విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు అందించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్‌యూఐ నాయకులు మహ్మద్ అబేద్, మహేశ్, శివ, అతీఫ్, జహీర్, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు



స్వామివారి పల్లకీసేవలో భక్తులు

కడ్తాల్: కడ్తాల్ మండలం మైసిగండి గ్రామంలోని శ్రీ కోదండరామచంద్ర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. మూడు రోజులుగా కొనసాగిన స్వామివారి బ్రహ్మోత్సవాలు ప్రత్యేక పూజలు, చక్రతీర్థం, పుష్కరస్నానం, పూర్ణాహుతి, పల్లకిసేవతో ముగిశాయి. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు భానుప్రకాశ్‌శర్మ, నాగేంద్రశర్మ, అమూల్యపతి ఆలయ ఈఓ స్నేహలత, ఆలయ ఫౌండర్, ట్రస్టీ శిరోలీ, తహసీల్దార్ జ్యోతి, భాస్కర్‌నాయక్,అరుణ్‌కుమార్, యాదగిరిస్వామి, చంద్రయ్య, దేవేందర్, కృష్ణ, శ్రీనివాస్, శ్రీను, శ్రీరాములు, రమాదేవి, కృష్ణగౌడ్, వెంకటేశ్, విజయ్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

గుండెపోటుతో వార్డు సభ్యురాలి మృతి



ఖైరున్నీసాబేగం (ఫైల్)

కడ్తాల్: కడ్తాల్ గ్రామ పంచాయతీకి చెందిన మాజీ ఉప సర్పంచ్, ప్రస్తుత వార్డు సభ్యురాలు ఖైరున్నీసా బేగం (68) శుక్రవారం గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి, ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి మండల కేంద్రానికి చేరుకుని ఆమె మృతదేహానికి నివాళులర్పించారు. ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు. పరామర్శించిన వారిలో ఎంపీపీ కమ్లీమోత్యానాయక్, జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, వైస్‌ఎంపీపీ ఆనంద్, సింగిల్‌విండో చైర్మన్ గంప వెంకటేశ్‌గుప్తా, సర్పంచ్‌లు సులోచన, ఎల్ఎన్‌రెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, ఉప సర్పంచ్ రామకృష్ణ, నాయకులు ఉన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్



కడ్తాల్: సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

కడ్తాల్: గర్భిణులు, బాలింతలు, బాలికలు పౌష్టికాహారం తీసుకోవాలని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, ఐసీడీఎస్ సీడీపీఓ సక్కుబాయి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ పక్షం–చిరుధాన్యాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, సీడీపీఓ సక్కుబాయి మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల్లో పౌష్టికాహార లోపం నిర్మూలనే లక్ష్యంగా పోషణ పక్షం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రక్తహీనత, ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా మహిళలు, చిన్నారులు పోషక విలువగల ఆహార పదార్థలపై దృష్టి సారించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ తమ ఆహారంలో చిరుధాన్యాలతో కూడిన ఆహారాన్ని చేర్చుకోవాలని కోరారు. బాల్య వివాహాలను అరికట్టాలని, బాలికలపై వివక్షత చూపించవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్త, ఎంపీడీఓ రామకృష్ణ, సర్పంచ్ ఎల్ఎన్‌రెడ్డి, ఎంపీటీసీలు శ్రీనివాస్‌రెడ్డి, లచ్చిరామ్‌నాయక్, పాఠశాల హెచ్ఎం విజయ, సూపర్‌వైజర్ సరళ, విద్యార్థులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల్లో మెండుగా పోషకాలు

మంచాల: పోషకాహారం తీసుకోవడంతోనే ఆరోగ్యంగా జీవించగలమని ఐసీడీయస్ సీడీపీఓ శాంతిశ్రీ అన్నారు. శుక్రవారం మంచాల మండల పరిధిలోని ఆరుట్ల గ్రామంలో 'పోషణ పక్షం' నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు తప్పక పోషక విలువలు గల ఆహారం తీసుకోవాలన్నారు. ఆహారం తీసుకోవడంతో పాటు వ్యాయామం, విశ్రాంతి కూడా చాలా అవసరమన్నారు. రక్త హీనతకు లోనవ్వకుండా ఐరన్ పోషకాలు ఎక్కువగా ఉన్న ఆహారం తీసుకోవాలన్నారు. చిరుధాన్యాల్లో చాలా పోషకాలు ఉంటాయన్నారు. వాటిని వివిధ రూపాల్లో ఆహారంగా తీసుకోవడం మంచిదన్నారు. ఈ కార్యక్రమంలో ఆరుట్ల సర్పంచ్ కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు కావలి శ్రీనివాస్, ఆరుట్ల వైద్యశాల వైద్యుడు కిరణ్ ప్రసాద్, అంగన్‌వాడీ సూపర్ వైజర్లు, టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

రుణాలు సకాలంలో చెల్లించండి

రైతు సేవా సహకార సంఘం చైర్మన్ విఠల్‌రెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్: సహకార సంఘం ద్వారా తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి సంఘం అభివృద్ధికి సహకరించాలని బాటసింగారం రైతు సేవా సహకార సంఘం చైర్మన్ లెక్కల విఠల్‌రెడ్డి పిలుపునిచ్చారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండల కేంద్రంలోని సంఘం కార్యాలయంలో శుక్రవారం జరిగిన సంఘం 52వ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సంఘం ద్వారా రుణాలను తీసుకున్న సభ్యులు సకాలంలో రుణాలను చెల్లించాలని కోరారు. గతంలో కంటే ఎక్కువ మొత్తంలో రుణాలను అందించేందుకు కృషిచేస్తామన్నారు. బాటసింగారంలో సంఘం నూతన బ్రాంచి భవన నిర్మాణంతో పాటు ఇతర అంశాలపై సమావేశంలో చర్చించి సభ్యులు ఆమోదించారు. సంఘం జమా ఖర్చులు, వ్యవహారాల నివేదికను మేనేజర్ ఐలేష్‌యాదవ్ చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ నార్లకొండ మల్లమ్మ, డైరెక్టర్లు సత్యనారాయణ, బాల్‌రెడ్డి, యాదిరెడ్డి, బాలనర్సింహ, మహేందర్‌రెడ్డి, భరత్‌కుమార్, రాములు, బాలనర్సింహ, లక్ష్మమ్మ, సర్పంచ్‌లు, మాజీ సర్పంచ్‌లు, సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

రూ.28.41 కోట్లతో మున్సిపల్ బడ్జెట్

ఆదిబట్ల మున్సిపల్ చైర్‌పర్సన్ ఆర్తిక



సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ ఆర్తిక

ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్ల మున్సిపాలిటీ అభివృద్ధికి కృషిచేస్తున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ కొత్త ఆర్తిక స్పష్టం చేశారు. ఆదిబట్ల మున్సిపాలిటీ 2023–24 బడ్జెట్ సమావేశం శుక్రవారం చైర్‌పర్సన్ అధ్యక్షతన మున్సిపాలిటీ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. మున్సిపాలిటీకి సంబంధించి 2023–24 సంవత్సరానికి గాను రూ.28.41 కోట్ల బడ్జెట్‌ను పాలకవర్గం ఆమోదం తెలిపిందని చెప్పారు. అంచనా వ్యయం రూ.28.12 కోట్లుగా కేటాయించామన్నారు. మిగులు రూ.29.62 లక్షలు అంచనా వేసినట్లు తెలిపారు. రానున్న వేసవిలో ప్రజలకు నీటి సమస్యలు రాకుండా చూసుకుంటామని తెలిపారు. వార్డుల్లో దోమల నివారణకు కృషి చేస్తామన్నారు. కోతుల బెడద లేకుండా చేస్తామని తెలిపారు. కలిసికట్టుగా మున్సిపాలిటీ అభివృద్ధికి బాటలు వేద్దామన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ అమరేందర్ రెడ్డి, కౌన్సిలర్లు మహేందర్, నాగేశ్, కృష్ణంరాజు, మౌనిక, సంధ్య, మౌనిక, అర్చన, ఇంజనీర్ వీరాంజనేయులు, అకౌంటెంట్ జ్యోతి, మేనేజర్ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా జగన్‌గౌడ్



ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న జగన్‌గౌడ్

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా దేశమోని జగన్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా మంకు మురళి ఎన్నికయ్యారు. శుక్రవారం స్థానిక కోర్టు అవరణలో జరిగిన బార్ అసోసియేషన్ ఎన్నికల్లో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి పదవులకు మాత్రమే ఎలక్షన్లు జరిగాయి. మిగతా సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అధ్యక్ష స్థానానికి పోటీచేసిన అంజన్‌గౌడ్ కేవలం ఒక్క ఓటుతో ఓడిపోగా.. ప్రధాన కార్యదర్శి స్థానానికి పోటీచేసిన జేపీ మహేందర్ 12 ఓట్లతో పరాజయం పాలయ్యారు. ఉపాధ్యక్షుడిగా గురువారెడ్డి, సంయుక్త కార్యదర్శిగా సత్యనారాయణ, కోశాధికారిగా నారాయణరెడ్డి, లైబ్రేరియన్‌గా ధనుంజయ, స్పోర్ట్స్, కల్చరల్ సెక్రటరీగా జగన్, కార్యవర్గసభ్యులుగా గణేశ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా మంద మహేందర్ వ్యవహరించారు. ఈ మేరకు ధృవీకరణ పత్రాలను అందజేశారు.

అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు ప్రారంభం



డ్రైనేజీ పనులను ప్రారంభిస్తున్న కౌన్సిలర్ మంగ

ఇబ్రహీంపట్నం: వార్డులోని అన్ని బస్తీలను దశలవారీగా అభివృద్ధి చేస్తామని 21వ వార్డు కౌన్సిలర్ మంగజగదీశ్వర్‌యాదవ్ తెలిపారు. శుక్రవారం వైస్ చైర్మన్ యాదగిరి, కౌన్సిలర్లతో కలిసి ఆమె వార్డు పరిధిలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను ప్రారంభించారు. ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి సహకారంతో డ్రైనేజీ పనులకు రూ.20 లక్షలు మంజూరైనట్లు చెప్పారు. వార్డులో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషిచేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు భర్తకి జగన్, జెర్కొని బాల్‌రాజ్, చిన్న, టీఆర్ఎస్ నాయకులు జగదీశ్వర్, శ్రీనివాస్‌రెడ్డి, యాచారం రవీందర్, కసరమోని మల్లేష్‌యాదవ్ పాల్గొన్నారు.

కష్టపడి పనిచేసేవారికి గుర్తింపు



చంద్రశేఖర్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరుతున్న నాయకులు

బీఆర్ఎస్ నేత చంద్రశేఖర్‌రెడ్డి

తలకొండపల్లి: సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల పట్ల ఆకర్షితులవుతులై ఇతర పార్టీల నాయకులు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని ఆ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని గట్టుఇప్పలపల్లిలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు చంద్రశేఖర్‌రెడ్డి సమక్షంలో శుక్రవారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. కష్టపడి పనిచేసేవారికి తగిన గుర్తింపు ఉంటుందన్నారు. మూడోసారి అధికారంలోకి రావడమే ధ్యేయంగా కార్యకర్తలు పనిచేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ జయమ్మ, వెంకటయ్య, రైతు సమన్వయ సమితి కోఆర్డినేటర్ శ్రీను, గ్రామ అధ్యక్షుడు రాజు, కృష్ణయ్య, శరత్‌చంద్రశర్మ, రాజశేఖర్, రవీందర్, గురువయ్య, అశోక్, సాయిబాబా, పురుషోత్తం తదితరులుపాల్గొన్నారు.

రైతులకు పరిహారం అందించండి

వైఎస్సార్‌టీపీ కల్వకుర్తి ఇన్‌చార్జి అర్జున్‌రెడ్డి



రైతులతో మాట్లాడుతున్న అర్జున్‌రెడ్డి

ఆమనగల్లు: కల్వకుర్తి ఎత్తిపోతల పథకం డీ–82 కాలువ నిర్మాణంలో భూములు కోల్పోయిన ఆమనగల్లు మండలం పోలెపల్లి, సింగంపల్లి గ్రామాల రైతులకు పరిహారం ఎప్పుడు అందిస్తారని వైఎస్సార్‌టీపీ కల్వకుర్తి ఇన్‌చార్జి చీమర్ల అర్జున్‌రెడ్డి ప్రశ్నించారు. కాలువ నిర్మించి ఏడేళ్లు కావస్తున్నా రైతులకు పరిహారం అందలేదని కనీసం సాగునీరు కూడా రాలేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆమనగల్లు మండలం పోలెపల్లి, సింగంపల్లి గ్రామాలలో అసంపూర్తిగా ఉన్న డీ–82 కాలువ పనులను శుక్రవారం అర్జున్‌రెడ్డి పరిశీలించారు. భూములు కోల్పోయిన రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. తమ భూములను తీసుకుని ఏడేళ్లు అయినా పరిహారం అందించలేదని, పరిహారం కోసం తిరిగితిరిగి అలసిపోయామని రైతులు ఆయన ముందు వాపోయారు. ప్రభుత్వం తమ భూమికి ప్రస్తుత మార్కెట్ ధరను చెల్లించాలని కోరారు. ప్రభుత్వం భూములు కోల్పోయిన రైతులకు వెంటనే ప్రస్తుతం మార్కెట్లో ఉన్న ధర ప్రకారం పరిహారం అందించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు తానయ్య, నర్సింహ, రాజు, సుదర్శన్, నరేశ్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, సాయి, మధు పాల్గొన్నారు.

కేసులతో అభివృద్ధిని అడ్డుకుంటున్నారు

- కాంగ్రెస్ నేతలపై ఎమ్మెల్యే మంచిరెడ్డి ఫైర్
- బీఆర్ఎస్ బలోపేతమే లక్ష్యంగా పనిచేయాలని పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

తుర్కయంజాల్: రాష్ట్రాభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రతీచోట అడ్డుతగులుతున్నారని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. తుర్కయంజాల్ మున్సిపాలిటీ భవన నిర్మాణానికి రూ.3 కోట్లు, ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణానికి రూ.4 కోట్ల నిధులను కేటాయించి పనులను ప్రారంభించినప్పటికీ కాంగ్రెస్ పార్టీ నాయకులు కోర్టుల్లో కేసులు వేసి పనులను అడ్డుకుంటున్నారని ఎమ్మెల్యే ఆరోపించారు. రాగన్నగూడలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో శుక్రవారం నిర్వహించిన తుర్కయంజాల్ మున్సిపాలిటీ బీఆర్ఎస్ పార్టీ నాయకుల ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వార్డు అధ్యక్షులు ప్రతినెల 5వ తేదీన తప్పనిసరిగా సమావేశాలు నిర్వహించి.. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఒక్కో వార్డు అధ్యక్షుడు 2వేల నుంచి 2500 ఓటర్లకు నాయకుడు అని.. ఒక్కో వార్డులో ఉన్న 25 మంది సభ్యులు సమష్టిగా పనిచేస్తే పార్టీ మరింత బలోపేతం అవుతుందని సూచించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందిస్తోందని.. దీన్ని ప్రజలకు వివరించాలన్నారు. భవిష్యత్ తాగునీటి అవసరాలను గుర్తించి ఒకేసారి రూ.96 కోట్లతో అన్ని కాలనీలకు తాగునీరు అందించాలనే ఉద్దేశ్యంతో పెద్ద ఎత్తున పనులను చేపడుతున్నామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మల్లేశ్, డీసీసీబీ వైస్ చైర్మన్ సత్తయ్య, జిల్లా రైతుబంధు అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, సీనియర్ నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి, లక్ష్మారెడ్డి, ముత్యంరెడ్డి, బల్‌దేవ్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

'పది' పరీక్షలకు సర్వం సిద్ధం

ఎంఈఓ హీర్యానాయక్

హయత్‌నగర్: పదవ తరగతి పరీక్షలకు అంతా సిద్ధం చేశామని హయత్‌నగర్ ఎంఈఓ హీర్యానాయక్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. సోమవారం నుంచి జరిగే పరీక్షలకు హయత్‌నగర్, అబ్దుల్లాపూర్‌మెట్టు మండలాల్లోని మొత్తం 28 పరీక్షా కేంద్రాలలో మొత్తం 6,519 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నట్లు ఆయన తెలిపారు. వీరిలో బీసీ, మైనార్టీ పాఠశాలలకు చెందిన 453 మంది ఉండగా ప్రైవేట్ పాఠశాలలకు చెందిన వారు 4,866 ఉన్నారని, ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 1233 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని ఆయన వివరించారు. ఒక్కో కేంద్రంలో సుమారు 230 మంది పరీక్షలు రాస్తారని.. సుమారు 400 మంది ఉపాధ్యాయులు (ఇన్విజిలేటర్లు) పనిచేస్తారని ఆయన అన్నారు. పరీక్షా కేంద్రాల్లో మౌలిక వసతులతో పాటు విద్యార్థులకు తాగునీరు, ఫస్ట్ ఎయిడ్ కిట్‌లను అందుబాటులో ఉంచామన్నారు. ఉదయం 9:30 గంటలకు పరీక్షలు ప్రారంభం అవుతాయని, విద్యార్థులు అరగంట ముందే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. ఇప్పటికే హాల్‌టికెట్లు పాఠశాలలకు పంపించామని.. హాల్‌టికెట్లు అందనివారు వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. పరీక్షా పత్రాలు శుక్రవారం హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నాయి. వాటిని భద్రపరిచి పరీక్షల రోజున పరీక్షా కేంద్రాలకు తరలిస్తారని అధికారులు తెలిపారు.

అంగన్‌వాడీ కార్యకర్తకు సత్కారం



వెంకటమ్మను సత్కరిస్తున్న అతిథులు

ఆమనగల్లు: మాడ్గుల మండలం కొల్కులపల్లి గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో జిల్లాస్థాయిలో ఉత్తమ అంగన్‌వాడీ కార్యకర్తగా అవార్డు అందుకున్న కొల్కులపల్లి అంగన్‌వాడీ కార్యకర్త వెంకటమ్మను శుక్రవారం సర్పంచ్ బట్టు అనురాధ, ఎంపీటీసీ బట్టు కిషన్‌రెడ్డి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు సత్తమ్మ, ప్రమీళ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ సేవలు అభినందనీయం

డిగ్రీ కళాశాల ప్రధానోపాధ్యాయుడు భాస్కర్

మంచాల: విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలని సిటీ డిగ్రీ కళాశాల ప్రధానోపాధ్యాయుడు బాల భాస్కర్ అన్నారు. శుక్రవారం ఆరుట్ల గ్రామంలో ఎన్ఎస్ఎస్ కార్యక్రమం ముగింపు సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుకునే దశలోనే సమాజం పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. జాతీయ సేవా పథకం కింద 170 మంది విద్యార్థులు, ప్రోగ్రాం ఆఫీసర్లు వారం రోజుల పాటు గ్రామాల్లో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఆరుట్ల సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాస్, మంచాల సీఐ వెంకటేశం, ఎస్ఐ రామన్ గౌడ్, ప్రోగ్రాం ఆఫీసర్లు నాగరాజు, జయ, సుదక్షణ, చంద్రకీర్తి, తిరుపతి, చతుర్వేద్ ఈరమ్మ పాల్గొన్నారు.

జామా మసీదులో ప్రత్యేక ప్రార్థనలు

ఆమనగల్లు: సర్వ మానవాళి శ్రేయస్సే అల్లా ధ్యేయమని మౌలానా అల్ హజ్ ఆబిద్ హుస్సేన్ ఖాద్రీ అన్నారు. ఆమనగల్లు పట్టణంలోని జామ మసీదులో శుక్రవారం రంజాన్ మాసం ప్రత్యేక ప్రార్థనల సందర్భంగా మసీదు కమిటీ అధ్యక్షుడు మహ్మద్ మాసూం ఆధ్వర్యంలో జామా మసీదులో హుస్సేన్ ఖాద్రీ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ధనిక, పేద అనే తేడా లేకుండా ప్రతిఒక్కరూ రంజాన్ పండుగను జరుపుకునే విధంగా తోటివారికి సహకారం అందించాలనికోరారు. వివిధ మసీదు కమిటీల అధ్యక్షులు గౌస్ మైనోద్దీన్, అబ్దుల్‌ఖాదర్ ఖాద్రి, నాయకులు.. అలీబేగ్, షఫీ, చోటేబేగ్, నూరొద్దీన్, షరుఫుద్దీన్, రజాక్, జబ్బార్, నయీం, మజీద్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించండి

పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశాల్లో అతిథులు



తలకొండపల్లి: ఖానాపూర్ జెడ్పీహెచ్ఎస్‌లో ఉపాధ్యాయులతో విద్యార్థులు

తలకొండపల్లి: ఉపాధ్యాయుల సూచనలు, సలహాలతో పదో తరగతి వార్షిక పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించాలని సింగిల్‌విండో డైరెక్టర్ యాదయ్యగౌడ్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ఖానాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పది విద్యార్థులకు వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎలాంటి ఒత్తిడికి లోను కాకుండా ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు రాయాలన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో హెచ్ఎం శంకర్, స్కూల్ కమిటీ చైర్మన్ జగన్, సింగిల్‌విండో డైరెక్టర్ యాదయ్యగౌడ్, కర్ణారెడ్డి, శారద, లక్ష్మీ, తులసి, సతీష్, బాలస్వామి, గోపాల్, మల్లేష్, స్వాతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాలకు మంచి పేరు తేవాలి..



ఇబ్రహీంపట్నం రూరల్: ఉపాధ్యాయులతో పదోతరగతి విద్యార్థులు

ఇబ్రహీంపట్నం రూరల్: పదవ తరగతి ఫలితాల్లో మంచి మార్కులు సాధించి పాఠశాలకు, ఎల్మినేడు గ్రామానికి మంచిపేరు తీసుకురావాలని ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శోభరాణి తెలిపారు. శుక్రవారం ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని ఎల్మినేడు గ్రామంలో పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. అదే గ్రామానికి చెందిన బజారు భిక్షపతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, స్టేషనరీ సామగ్రి అందజేశారు. ఉపాధ్యాయులు బీరప్ప, జగన్మోహన్‌రెడ్డి, వెంకటయ్య, రాజేందర్, బాలశౌరి, శ్రీలత, జ్యోతి, ఆరుణశ్రీ విద్యార్థులు పాల్గొన్నారు .

ప్రైవేట్‌కు దీటుగా ఫలితాలు సాధించాలి..

కడ్తాల్: ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించాలని జిల్లా ఎంపీటీసీల సంఘం ప్రధాన కార్యదర్శి గోపాల్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని రావిచేడ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం దేవేందర్, ఎస్ఎంసీ చైర్మన్ రవి, ఉపాధ్యాయులు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించని సమావేశాలెందుకు?

- బడ్జెట్ సమావేశాన్ని బహిష్కరించిన మెజార్టీ కౌన్సిలర్లు
- ఎలాంటి తీర్మానాలు చేయకుండానే వాయిదా పడిన సమావేశం



బడ్జెట్ సమావేశాన్ని బహిష్కరించి నిరసన తెలుపుతున్న కౌన్సిలర్లు

హయత్‌నగర్: ప్రజా సమస్యల విషయమై చర్చించేందుకు సమావేశాలు నిర్వహించనప్పుడు బడ్జెట్ పేరుతో ప్రత్యేక సమావేశాలు ఎందుకు నిర్వహిస్తున్నారని మెజార్టీ సభ్యులు పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ బడ్జెట్ సమావేశాన్ని బహిష్కరించారు. దీంతో ఎలాంటి తీర్మానాలు చేయకుండానే మున్సిపల్ బడ్జెట్ సమావేశం వాయిదా పడింది. వివరాల్లోకి వెళ్తే.. చైర్‌పర్సన్ చెవుల స్వప్న అధ్యక్షతన శుక్రవారం పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ బడ్జెట్ సమావేశం తట్టిఅన్నారంలోని వార్డు కార్యాలయంలో నిర్వహించారు. సభ ప్రారంభమైన వెంటనే మూడు నెలలుగా సాధారణ సమావేశం నిర్వహించకుండా బడ్జెట్ సమావేశాన్ని ఎలా నిర్వహిస్తారని పలువురు సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. సమావేశాలు లేకపోవడంతో మూడు నెలలుగా ప్రజా సమస్యలపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని.. సమస్యల ప్రస్తావన లేకుండా నేరుగా బడ్జెట్ సమావేశాన్ని నిర్వహించడంపై మెజారిటీ సభ్యులు తప్పుబట్టారు. ఈ క్రమంలో చైర్‌పర్సన్ వ్యతిరేక, అనుకూల వర్గాల మధ్య వాగ్వాదం జరిగినట్లు తెలుస్తుంది. చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాస తీర్మానానికి నోటీసులు ఇచ్చిన తర్వాత ఇదే మొదటి సమావేశం కావడంతో సభ్యులు పార్టీలకు అతీతంగా రెండు వర్గాలుగా చీలిపోయారు. ఈ క్రమంలో సమావేశంలో ఆరోపణలు, ప్రత్యారాపోణలు జరిగినట్లు కొందరు సభ్యులు తెలిపారు. మొత్తం 24 మంది సభ్యుల్లో 15 మంది సభ్యులు సమావేశాన్ని బహిష్కరించడంతో ఎలాంటి తీర్మానాలు చేయకుండానే సమావేశాన్ని వాయిదా వేసినట్లు కమిషనర్ తెలిపారు. రెండు రోజుల్లో మరోసారి సమావేశాన్ని నిర్వహించే అవకాశం ఉంది. కాగా వరుసగా మూడు నెలలు సమావేశం నిర్వహించకుంటే చైర్‌పర్సన్‌కు నోటీసులు ఇచ్చే అవకాశం ఉండటంతోనే ఆదరా బాదరాగా బడ్జెట్ సమావేశాన్ని ఏర్పాటు చేశారని సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు.